మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళాలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు

మల్లాపూర్: మహిళలు వివక్షకు గురవుతున్నామనే అపోహ వీడి అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మల్లాపూర్ నెహ్రూనగర్‌లో మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. మహిళాలు సంఘాల అభివృద్ధి, మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోని ఆర్థికాభివృద్ధి సాధించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, ప్రభుదాస్, స్థానిక నేతలు మధన్, జగన్, రాము, లంబూ శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలని వినతి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి మంగళవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాషను కలిసి డివిజన్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అల్వాల్ కొత్త చెరువులో గుర్రపు డెక్క తొలగించడంతో పాటు డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు కల్పించాలని ఆమె వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

9 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు



కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్, కైలాసగిరిలోని కైలాసగిరి మల్లికార్జున స్వామి దేవాస్థానం, లక్ష్మీనర్సింహ స్వామి దేవస్థానం 24వ వార్షిక మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 9 వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి, ధర్మకర్తలు బండారి నీలకంఠరెడ్డి, జలగం వెంకటేష్, జగదీశ్వర్‌రావు, సముద్రాల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

క్లీన్, గ్రీన్ మౌలాలిగా తీర్చిదిద్దాలి



మౌలాలి: క్లీన్ అండ్ గ్రీన్ మౌలాలిగా తీర్చిదిద్దేకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతా శేఖర్ యాదవ్ అన్నారు. మంగళవారం మౌలాలిలోని గీతా నగర్‌పార్క్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తను ఇంటింటికి వచ్చే చెత్తా ఆటోలకు అందించాలని సూచించారు. మౌలాలి డివిజన్‌ను చెత్త రహిత డివిజన్‌గా తీర్చిదిద్దిలని కోరారు. సమావేశంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ ఎఫ్‌ఏ అంజమ్మ, భారతి కాలనీ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వాగ్మికరావు ఫౌండేషన్ వార్షికోత్సవ వేడుకలు



అల్వాల్: వాగ్మికరావు ఫౌండేషన్ 5వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఓల్డ్ అల్వాల్ కామధేను హాలులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో ఉచితంగా సేవలు అందించిన సామాజిక సంఘాలను ఎంపిక చేసి వారికి తెలంగాణ సేవా రత్న అవార్డులు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో గీత భాస్కర్, రజిత మైనంపల్లి, నటులు వాసుదేవరావు, గౌతమ్, చైల్డ్ ఆర్టిస్ట్ సహస్ర, ఫౌండేషన్ ఫౌండర్ విష్ణురావు, స్థానికులు దిడ్ల స్వామి, విగ్నేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో శివరాత్రి ఉత్సవాలు

ఉప్పల్: ఉప్పల్ బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 9వ తేదీ వరకు మహా శివరాత్రిని పురస్కరించుకుని శ్రీరామేశ్వర జ్యోతిర్లింగ మహా దర్శనం ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసినట్లు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయ ఉప్పల్ నిర్వాహకులు తెలిపారు. తమిళనాడులో ఉన్న రామేశ్వర జ్యోతిర్లింగ ప్రతిరూపం, ద్వాదశ జ్యోతిర్లింగాల దర్శనం, 108 జ్యోతి ప్రజ్వలన, రుద్రాభిషేకం, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరవుతారని తెలిపారు. భక్తులకు ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు దర్శనం ఉంటుందన్నారు.

కుషాయిగూడ ఏసీపీగా మహేష్

కుషాయిగూడ: కుషాయిగూడ ఏసీపీగా డి.మహేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మొన్నటి వరకు ఇక్కడ ఏసీపీగా బాధ్యతలు నిర్వహించిన నరేష్‌రెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, మహేశ్వరం ట్రాఫిక్ ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న డి.మహేష్‌ను కుషాయిగూడ ఏసీపీగా విధుల్లో చేరాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు జరగబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూస్తానన్నారు.

కొనసాగుతున్న భగవద్గీత జ్ఞాన యజ్ఞం



అల్వాల్: అల్వాల్‌లోని శ్రీబాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీమత్ భగవద్గీత జ్ఞాన యజ్ఞంలో భాగంగా ఆరవ రోజు మంగళవారం రుద్రాభిషేకం, శ్రీభాగవత సప్తాహం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ది రమేష్, బ్రహ్మచారి, పద్మచారి, వెంకటేశ్వర్లు, బాలగంగాధర్‌రావు, శివ, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జైపాల్, కేశవరావు, రాఘవన్, ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

థీమ్ పార్కు షురూ..

- నేడు చర్లపల్లి పారిశ్రామికవాడలో..
- రూ.4 కోట్లతో పార్కు అభివృద్ధి
- ప్రొఫెసర్ జయశంకర్ పార్క్‌గా నామకరణం



పార్కులో స్వాగతం పలికే కాకతీయ తోరణం

కుషాయిగూడ: టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో చర్లపల్లి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన థీమ్ (ప్రొఫెసర్ జయశంకర్) పార్కు బుధవారం ప్రారంభం కానుంది. ఆరు ఎకరాల విస్తీర్ణంలో మూడు ఎకరాల్లో రూ.4 కోట్ల వ్యయంతో థీమ్ పార్కును అభివృద్ధి చేశారు. 2018లో అప్పటి మంత్రి కేటీఆర్ దీనికి శంకుస్థాపన చేశారు. కాగా గతేడాది ఆగస్టులోనే థీమ్ పార్కు పనులు పూర్తయ్యి ప్రారంభానికి సిద్ధమైంది. కానీ మాజీ మంత్రి కేటీఆర్ సమయం దొరకకపోవడంతో పార్కు ప్రారంభం ఆలస్యమవుతూ వచ్చింది. ఈ క్రమంలోనే ఎన్నికల్ కోడ్ వచ్చింది. ఇలా పలుమార్లు వాయిదా పడుతూ వచ్చిన థీమ్ పార్కుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ప్రొఫెసర్ జయశంకర్ పార్కు బుధవారం టీఎస్ఐఐసీ ఎండీ డాక్టర్ ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి ఐఎఫ్ఎస్ చేతులమీదుగా ప్రారంభం కానుంది. మంత్రి శ్రీధర్‌బాబు హాజరవుతారని ప్రచారం జరిగినా మంత్రి రాక కుదరకపోవడంతో అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని టీఎస్ఐఐసీ, ఐలా నిర్ణయించింది.

థీమ్ పార్కులో ప్రత్యేకతలు..

మూడు ఎకరాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం తలపించేలా థీమ్ పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పార్కులో అడుగు పెట్టగానే స్వాగతం పలికే కాకతీయ తోరణం, ప్రత్యేక ఆకర్షణగా 30 మీటర్ల అతి పెద్ద జాతీయ జెండా, ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు, ఆహ్లాదాన్ని పంచే గ్రీనరి, వాటర్ ఫాల్స్, సేద తీరడానికి అవసరమైన సౌకర్యాలు పార్కులో దర్శనమిస్తాయి.

మూడు నెలలు ఐలా ఆధ్వర్యంలోనే..



చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్–2లో అన్ని రకాల వసతులు, హంగులతో ఆహ్లాదకరమైన వాతావరణం తలపించేలా థీమ్ పార్కును అభివృద్ధి చేశాం. ఆరు ఎకరాల్లో మూడు ఎకరాలు పార్కు స్థలానికి కేటాయించి అభివృద్ధి చేశాం. మిగతా 3 ఎకరాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడానికి నిర్ణయించాం. అందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. మూడు నెలల వరకు థీమ్ పార్కు నిర్వహణ బాధ్యత ఐలా చూసుకుంటుంది. ఆ తర్వాత పార్కులోకి ప్రవేశానికి టికెట్ ఏర్పాటు చేసి వచ్చే ఆదాయంతో పార్కు నిర్వహణ చేపట్టాలని నిర్ణయించాం.

– జెక్క రోశిరెడ్డి, ఐలా చైర్మన్





పార్కులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్

ఎంఎంటీఎస్ రైలుకు బీజేపీ నేతల స్వాగతం



నేరేడ్‌మెట్ రైల్వే స్టేషన్‌లో రైలుకు స్వాగతం పలుకుతున్న కార్పొరేటర్ శ్రవణ్, బీజేపీ నాయకులు



భూదేవినగర్ రైల్వే స్టేషన్‌లో స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

అల్వాల్: భారత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఎంతో అభివృద్ధి చెందుతోందని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. ఎంఎంటీఎస్ ఫేస్–2లో భాగంగా ఘట్‌కేసర్ నుంచి బయలుదేరిన మొదటి రైలుకు నేరేడ్‌మెట్ రైల్వే స్టేషన్‌లో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాల్‌లింగం, నాయకులు ఓంప్రకాష్, నందుయాదవ్, మురళీగౌడ్, సంతోష్, రవి, ప్రభుగుప్తా, కృష్ణమూర్తి, అంజన్న, సుకేష్, శ్రీకాంత్, సుశీల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూదేవినగర్‌లో..

భూదేవినగర్ రైల్వే స్టేషన్‌లో ఎంఎంటీఎస్ రైలుకు బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నాయకులు మల్లిఖార్జునగౌడ్, వెంకటేష్, కృష్ణారెడ్డి, మాణిక్యరెడ్డి, వినయ్‌శంకర్, రవికిరణ్, సురేందర్‌రెడ్డి, దేవేందర్, సుజాత తదితరుల పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, వీఎన్‌రెడ్డినగర్‌లోని శివాలయ వార్షికోత్సవ వేడుకలను నేటి నుంచి 8 వరకు నిర్వహిస్తామని ఆలయ ఫౌండర్ చైర్మన్ ఉప్పల యాదగిరిరెడ్డి తెలిపారు. ఈ నెల 6న అఖండ దీపారాధన, పుణ్యవచనం, 7న శ్రీమహాగణపతి పూజామహోత్సం, మహాశివరాత్రి 8న ఉదయం రుద్రాభిషేకం, సాయంత్రం 7 గంటలకు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా మహా శివరాత్రి ఉత్సవాలు

బోడుప్పల్: పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబ దేవి ఆలయంలో ఈ నెల 8వ తేదీన మహా శివరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ కామారౌతు వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, సామూహిక అభిషేకాలు, శివపార్వతుల కల్యాణ మహోత్సవం, లింగోద్భవ, అష్టోత్తర పుష్ప బిల్వ అర్చనలు, అభిషేకాలు, సర్వదర్శనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టండి



వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌యాదవ్

బోడుప్పల్: రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగర పాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా జలమండలి అధికారులు చూడాలని బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం జలమండలి అధికారులు, కార్పొరేటర్లతో కలిసి నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుప్పల్‌లో పైపులైన్ల సమస్యలు, లీకేజీలు, కొత్త వాటర్ పైపులైన్ల మొదలగు వాటిని గురించి కార్పొరేటర్లు, అధికారులతో చర్చించారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా పలువురు కార్పొరేటర్లు తమ డివిజన్‌ల పరిధిలో ఉన్న సమస్యల గురించి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు, జలమండలి అధికారులు పాల్గొన్నారు.

8న శ్రీదుర్గా జ్యోతిషాలయంలో శివరాత్రి వేడుకలు

గౌతంనగర్: డివిజన్ ఉత్తమ్‌నగర్‌లో ఉన్న శ్రీదుర్గా జ్యోతిషాలయంలో ఈ నెల 8వ తేదీన మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మోగు నాగరాజుశర్మ ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు స్ఫటిక లింగానికి అభిషేకం, అనంతరం మహారుద్ర హోమం, గోపూజ, మహా లింగార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు హాజరై స్వామి వారి అనుగ్రహం పొందాలని తెలిపారు. వివరాలకు ఫోన్: 98664 72571.

వైభవంగా మల్లన్న జాతర



జాతర వేడుకల్లో కార్పొరేటర్ జంగయ్యయాదవ్

బోడుప్పల్: చెంగిచర్ల రాజేష్‌నగర్ కాలనీలోని శ్రీకేతకి భ్రమరాంబికా సమేత మల్లిఖార్జున స్వామి, ఎల్లమ్మ కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కొండ పోచమ్మ గుడిలో పెద్ద పట్నం వేయడం, బోనాలు సమర్పించడం జరిగింది. కార్యక్రమంలో 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్య యాదవ్ దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను పాటించాలని, భక్తిశ్రద్ధలతో వేడుకలు నిర్వహించాలని సూచించారు. ప్రశాంతమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నట్లు తెలిపారు.

ఎల్ఆర్ఎస్‌ను నిరసిస్తూ ధర్నా నేడు

ఉప్పల్: ఎల్ఆర్ఎస్ విషయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, లేనప్పుడు మరోలా ప్రవర్తించడాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దుయ్యబట్టారు. ఎల్ఆర్ఎస్ విషయంపై ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపడుతూ బుధవారం బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గం ఆధ్వర్యంలో ఉప్పల్ చౌరస్తాలో రాస్తారోకో, ధర్నా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు, బాధితులు, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రెండో రోజు కిటకిటలాడిన ఎక్స్‌పో



ఇన్నోవేటివ్ ఆక్వా స్టాల్ వద్ద నీటి శుద్ధి విధానాన్ని తెలుసుకుంటున్న విద్యార్థులు

కుషాయిగూడ: చర్లపల్లి పారిశ్రామికవాడలో చర్లపల్లి ఇండస్ట్రీయల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఎంఎస్ఎంఈ–2024 ఎక్స్ పో రెండోరోజు మంగళవారం సందర్శకులతో కిటకిటలాడింది. పారిశ్రామికవేత్తలు, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులతో ఎక్స్‌పోలో సందడి నెలకొంది. సోలార్, మైనింగ్ అండ్ డ్రిల్లింగ్ ఎక్విప్‌మెంట్, ఇంజినీరింగ్ అండ్ హెవీ మెషినరి, ఫోర్జింగ్, ఫార్మా అండ్ కెమికల్, ఫర్నిచర్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, టెలీ కమ్యూనికేషన్‌లకు సంబంధించిన ఉత్పత్తులను ఎక్స్‌పో ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి ఎక్స్‌పోలు ఎంఎస్ఎంఈ యూనిట్ల మార్కెటింగ్ సదుపాయాలను మెరుగుపరిచేందుకు దోహదపడతాయని పలువురు పారిశ్రామికవేత్తలు అభిప్రాయపడ్డారు. ప్రతి సంవత్సరం ఇలాంటి ఎక్స్ పోలను ఏర్పాటు చేసి మార్కెటింగ్‌తో పాటుగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంపై కూడా అవగాహన పెరుగుతుందన్నారు. మూడు రోజుల ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో బుధవారం ముగియనుంది. ముగింపు కార్యక్రమానికి టీఎస్ఐఐసీ ఎండీ డాక్టర్ ఈ.విష్ణువర్ధన్‌రెడ్డి ఐఎఫ్ఎస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు సీఐఏ అధ్యక్షుడు గోవిందారెడ్డి తెలిపారు.

పర్యాటకరంగంలో అపార అవకాశాలు

సాక్షి, సిటీబ్యూరో: భారతదేశ పర్యాటక రంగం శరవేగంతో పుంజుకుంటోందని పర్యాటక రంగ నిపుణులు అన్నారు. మన దేశ పర్యాటకులు చేసే వార్షిక వ్యయం 2030 నాటికి 410 బిలియన్ డాలర్లకు చేరుకోనుందని కోవిడ్ విజృంభణకు ముందు నాటి పరిస్థితులతో పోలిస్తే ఇది 173శాతం పెరుగుదలగా వెల్లడించారు. పర్యాటకులకు ఆర్థిక సంబంధిత సేవలు అందించే జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ లిమిటెడ్, ప్రముఖ ట్రావెల్ ఆపరేటర్ ఈజ్ మై ట్రిప్‌తో ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పర్యాటక రంగ నిపుణులు మాట్లాడుతూ కార్పొరేట్ పర్యాటకం పుంజుకుంటున్న కొద్దీ ఆర్థిక అంశాలకు సంబంధించిన సేవల అవసరమూ పెరుగుతోందన్నారు.

కాంగ్రెస్‌లోకి గాంధీనగర్ యూత్ ప్రతినిధులు



మంత్రి తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గాంధీనగర్ యూత్ ప్రతినిధులు

కాప్రా: గాంధీనగర్ యూత్ అసోసియేషన్‌కు చెందిన పలువురు ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి ఆధ్వర్యంలో హస్తం గూటికి చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీనగర్ యూత్ ప్రతినిధులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలు, యువత, నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులమై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ కాప్రా డివిజన్ అభివృద్ధికి పాటుపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, బాలయ్య, శ్రీహరి, రాంచందర్, శ్రీకాంత్, దశమంత్, రాజు, యాదగిరి, రవి, చిన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యా, వైద్యం కోసం రూ.లక్షల వసూలు

మంత్రి సీతక్కను కలిసిన దళిత జనసమితి ప్రతినిధులు



మంత్రి సీతక్కతో దళిత జనసమితి ప్రతినిధులు

మల్లాపూర్: రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను నాచారం డివిజన్‌కు చెందిన దళిత జనసమితి ఆధ్వర్యంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యా, వైద్యం విషయంలో లక్షల రూపాయలను వసూలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో దళిత జనసమితి వ్యవస్థాపక అధ్యక్షులు బొజ్జ యాదగిరి, ఉపాధ్యక్షులు సంపత్, కార్మిక విభాగం అధ్యక్షులు బొజ్జ రమేష్, గంగాధర్, బాలయ్య, మజీద్, భార్గవ్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం



అల్వాల్: మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదేశాల మేరకు మంగళవారం అల్వాల్ సర్కిల్–133, 134, 135 డివిజన్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సమావేశం అల్వాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు డివిజన్ల యూత్ కమిటీ సంబంధించిన విషయాలు, సర్కిల్ యూత్ కమిటీలో పేర్లు నమోదు, తదితర విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజ్‌జితేందర్‌నాథ్, ఏ–బ్లాక్ అధ్యక్షులు అశోక్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, యాదగిరి, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, అఫ్సర్, కృష్ణగౌడ్, రమేష్, బలవంత్‌రెడ్డి, శకుంతలనాయుడు, బబిత, కవిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఈటల రాజేందర్



బోడుప్పల్: బోడుప్పల్‌లోని శ్రీభ్రమరాంబ సహిత మల్లిఖార్జున స్వామి 26వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలకు మంగళవారం మాజీ మంత్రి, బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలని, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే విధంగా వేడుకలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా రేణుకా ఎల్లమ్మ వారి కల్యాణ మహోత్సవం, బోనాలు సమర్పించడం, గొలుసు తెంపుట, అగ్ని గుండాలు తొక్కుట, ఫలహార బండి ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు యాదవ్, బీజేపీ నేతలు ఏనుగుల లక్ష్మయ్య, జనిగె వెంకటేశ్‌యాదవ్, జడిగె శ్రీశైలం, జనిగె శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

గౌతంనగర్: గౌతంనగర్‌లోని భాష్యం స్కూల్‌లో 10వ తరగతి చదివే అతీఫ్ చదువులో ఉత్తీర్ణత పొందినా ఫీజు కట్టడంలో తల్లిదండ్రులు ఆర్థికంగా వెనుకబడి ఉన్నారు. విషయం తెలుసుకున్న మానవసేవే మాధవసేవ వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు, అడ్మిన్ కుమ్మరి రాజు దాతల సహకారంతో మంగళవారం అతీఫ్ స్కూల్ ఫీజుకు రూ.20 వేల చెక్కు అందజేశారు. అదేవిధంగా అతీఫ్ పైచదువులకు కూడా తామే చెల్లిస్తామని వాట్సాప్ గ్రూప్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడ్మిన్ కుమ్మరి రాజు, అహ్మద్ అలీఖాన్, అబ్దుల్ రెహమాన్, వెంకటరమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాలార్‌జంగ్ కంచ భూముల్లో నిర్మాణాల కూల్చివేత



మేడిపల్లి మండల రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లాట్ల యజమానులు ఆందోళన

మేడిపల్లి: మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ సాలార్‌జంగ్ కంచ సాయిప్రియనగర్ కాలనీలో మంగళవారం తెల్లవారుజామున రెవెన్యూ అధికారులు సర్వే నంబర్లు–10, 11లలో వెలసిన నిర్మాణాలను కూల్చివేయడంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. వందలాది మంది పోలీసుల పహారా మధ్య జేసీబీ సాయంతో రెవెన్యూ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ప్లాట్ల యజమానులు ఎంత చెప్పినా వినకుండా వందలాది ఇళ్లను నేలమట్టం చేశారు. ప్లాట్లు అమ్మి సొమ్ము చేసుకున్న రియల్టర్లను వదిలి తమను ఆక్రమణదారులంటూ అన్యాయం చేయడం సరికాదంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. దశాబ్దాలుగా ఉన్న వివాదాన్ని పరిష్కరించాలని, ప్లాట్లపై తమకు యాజమాన్య హక్కులను కల్పించాలని సాయిప్రియనగర్ సంక్షేమ సంఘం పలుమార్లు ఆందోళనలు చేపట్టడంతో గత ప్రభుత్వం జీవో 118తో పరిష్కారం చూపేందుకు ప్రయత్నించింది. ప్లాట్ల యజమానులు జీవో–118 కింద క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకుని రుసుము సైతం చెల్లించారు. అయినా నేటికీ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మేడిపల్లి మండల రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లాట్ల యజమానులు నిరసన వ్యక్తం చేశారు. నిర్మాణాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.